# కదం తొక్కిన గులాబీ దండు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

## పకడ్బందీగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, నవంబర్ 21 : పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.వెంకట్రావ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ కౌశిగన్, బాలకిషన్ ముండా, అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి పోస్టల్ బ్యాలెట్ విధి విధానాలపై నాలుగు నియోజక వర్గాలకు కేటాయించిన ఓటింగ్ బృందాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సదుపాయం కల్పించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1,008 మంది ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కి దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. ప్రతి ఓటరుకు ముందస్తుగా బీఎల్ఓలతో సమాచారం అందించడం జరుగుతుందన్నారు. ఓటరు ఇంటికి మొదటిసారి వెళ్లినప్పుడు లేకుంటే రెండోసారి వెళ్లి ఓటు వేయించాల్సి ఉంటుందని తెలిపారు. రహస్య ఓటింగ్ చేపట్టాలని ప్రతి ఒక్కరి వద్ద వీడియోగ్రాఫింగ్ చేయించాలన్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో ఓటింగ్ ప్రక్రియ ఉంటుందని ఆరోజు అందుబాటులో లేనివారు 25న ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఓటింగ్ ప్రక్రియలో ఎవరైనా భంగం కలిగిస్తే ఆర్‌పీ చట్టం ప్రకారం క్రమ శిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో తాసీల్దార్లు, కమిటీ బృందాలు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్ : అనంతారంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి సీఎం సభకు వెళ్తున్న జడ్పీటీసీ అనితాఅంజయ్య

## సీఎం కేసీఆర్ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

సూర్యాపేట రూరల్, నవంబర్ 21 : జిల్లా కేంద్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ట్రాక్టర్లు, ఆటోలు, డీసీఎంలలో భారీగా తరలివెళ్లారు. తరలి వెళ్లిన వారిలో ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్‌నాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చివ్వెంల : మండల కేంద్రంతో పాటు వట్టిఖమ్మంపహాడ్, బండమీదిచందుపట్ల, గుంజలూరు, జి తిరుమలగిరి, వల్లభాపురం, లక్ష్మీనాయక్‌తండా, పాండ్యానాయక్‌తండా, రాజుతండా నుంచి బీఆర్ఎస్ శ్రేణులు సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు భారీ ఎత్తున తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీ ధరావత్ కుమారీబాబూనాయక్, మండలాధ్యక్షుడు జూలకంటి జీవన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మారినేని సుధీర్‌రావు, రౌతు నర్సింహారావు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : జిల్లా కేంద్రములో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లాయి. తరలి వెళ్లిన వారిలో ఎంపీపీ నెమ్మాది భిక్షం, జడ్పీటీసీ మామిడి అనితాఅంజయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దొంగరి యుగేంధర్, పీఏసీఎస్ చైర్మన్లు వెన్న సీతారాంరెడ్డి, నాతాల జానకిరాంరెడ్డి, సర్పంచులు బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పరెడ్డి సీతారాంరెడ్డి, షరీపుద్దీన్, చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, బొల్లక సైదమ్మాబొబ్బయ్య, బిట్టు నాగేశ్వర్‌రావు, నెమ్మాది నగేశ్, ఎంపీటీసీ మామిడి రేవతి, జూలకంటి వెంకట్‌రెడ్డి, పొదిల నాగార్జున, దంతాల వెంకటేశ్వర్లు, మస్తాన్, రఫి, తూముల ఇంద్రసేనారావు, కొండేటి సతీశ్, బొల్లెద్దు వినోద్ ఉన్నారు.



చివ్వెంల : సూర్యానాయక్‌తండా నుంచి భారీగా తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు



సూర్యాపేట రూరల్ : ఆరెగూడెం నుంచి ట్రాక్టర్లపై వెళ్తున్న ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు

- సూర్యాపేట ప్రజా ఆశీర్వాద సభకు పోటెత్తిన జనం
- మహిళలు, యువకులతో కిక్కిరిసిన సభా ప్రాంగణం
- సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలికిన మంత్రి జగదీశ్‌రెడ్డి
- కేరింతలు, చప్పట్లతో మద్దతు పలికిన ప్రజలు

సూర్యాపేట, నవంబర్ 21 : సూర్యాపేట ప్రజా ఆశీర్వాద సభ గ్రాండ్ సక్సెస్ అయింది. బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం వ్యవసాయ మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు జనం పోటెత్తారు. గులాబీ దండుతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఎటూ చూసినా గులాబీ జెండాలు పట్టుకుని ప్రజలు పెద్ద ఎత్తున సభకు తరలివచ్చారు. స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రసంగిస్తూ నియోజక వర్గానికి కావాల్సిన పనులు, పథకాల గురించి ప్రస్తావించగా ప్రజలు పెద్ద ఎత్తున చప్పట్లతో మద్దతు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగానికి ప్రజలు పెద్ద ఎత్తున స్పందించారు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తే రూ.5 వేల పెన్షన్ వస్తుంది. కావాలా? వద్దా? అని సీఎం అడుగగా ప్రజలు కావాలంటూ పెద్ద ఎత్తున చప్పట్లతో తమ హర్షామోదం తెలిపారు. రైతు బంధు దుబారా అని ఈ జిల్లాకు చెందిన మాజీ పీసీసీ అధ్యక్షుడు అంటున్నాడు. రైతు బంధు దుబారానా? అని సీఎం అడుగగా.. కాదు అని ప్రజలు పెద్ద ఎత్తున నినదించారు. ధరణి ఉండాలా? వద్దా? అంటే ఖచ్చితంగా ఉండాలే అని ప్రజలు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ తెచ్చేది భూ మాత కాదు భూ మేత అని అనగానే ప్రజలు చపట్లతో హర్షాతీరేకం వ్యక్తం చేశారు. ఇవ్వన్ని ఉండాలంటే జగదీశ్‌రెడ్డిని 50 వేల మెజార్టీతో గెలిపించాలని పిలుపునివ్వడంతో గెలిపిస్తామని నినాదాలు చేశారు.



సీఎం కేసీఆర్‌కు తిలకం దిద్దుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత

### ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

ప్రజా ఆశీర్వాద సభకు వచ్చిన గులాబీ దళపతి, సీఎం కేసీఆర్‌కు హెలీప్యాడ్ వద్ద ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే అభ్యర్థి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. మంత్రి వెంట ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఒంటెద్దు నర్సింహారెడ్డితో పాటు పలువురు నాయకులు ఉన్నారు. అనంతరం ప్రత్యేక బస్సులో సీఎం సభా ప్రాంగణానికి చేరుకున్నారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజా ఆశీర్వాద సభకు వచ్చిన ప్రజానికాన్ని సాంస్కృతిక కార్యక్రమాలు ఆలరించాయి. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఉద్యమ గేయాలతో కళాకారులు ప్రజలను ఉర్రూతలూగించారు. మద్దెల సందీప్ బృందం ఆట పాటలతో సభ ప్రాంగణం మొత్తం హోరెత్తింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు జిల్లా పరిస్థితులు ఎలా ఉండే.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ పాలనలో ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు రాష్ట్రం ఏ విధంగా అభివృద్ధి చెందిందనేది వివరిస్తూ ఆలపించిన గేయాలు అందరినీ ఆలోచింపజేశాయి. సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాల పాటతో పాటు సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ రూపొందించిన గులాబీల జెండాలే రామక్క పాటకు అంతా చిందేశారు.

### సీఎం సభ హైలైట్స్

- మధ్యాహ్నం 2 గంటల వరకు అంబేద్కర్ నగర్‌లోని ప్రజా ఆశీర్వాద సభ ప్రాంగణం నిండిపోయింది
- నియోజక వర్గంలోని నాలుగు మండలాల నుంచి మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో సభకు హాజరయ్యారు.
- 4.28 గంటలకు సీఎం కేసీఆర్ హెలికాప్టర్ సభా ప్రాగణంలో చెక్కర్లు కొట్టింది
- 4.30 గంటలకు హెలిప్యాడ్ వద్ద చాపర్ ల్యాడ్ అయింది
- అక్కడి నుంచి ప్రత్యేక బస్సులో సీఎం సభా ప్రాంగణానికి బయల్దేరారు
- 4.36 గంటలకు మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రసంగం ప్రారంభం
- 4.39 గంటలకు సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ వేదిక పైకి చేరుకున్నారు
- 4.44 గంటలకు సీఎం ప్రసంగం ప్రారంభం
- 5.06 గంటలకు ప్రసంగం ముగింపు – 5.09 గంటలకు సీఎం హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు
- 5.12కు హైదరాబాద్ బయల్దేరి వెళ్లారు.



హెలిప్యాడ్ వద్ద సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఒట్టెందు నరసింహారెడ్డి



సీఎం కేసీఆర్‌తో బీఆర్ఎస్ నేత చెరుకు సుధాకర్



సభా ప్రాంగణానికి తరలి వస్తున్న ప్రజలు